## క్లుప్తంగా

### విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

**టేక్మాల్(మెదక్):** విద్యాసంస్థల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.నరేశ్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రం టేక్మాల్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు అరికట్టాలని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అభిలాష్, ప్రశాంత్, కార్తీక్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

### కూచారంలో యూత్ భవనం ప్రారంభం

**మనోహరాబాద్(తూప్రాన్):** మండలంలోని కూచారం గ్రామంలో గడా ప్రత్యేక నిధులతో నూతనంగా నిర్మించిన యూత్ భవనాన్ని సర్పంచ్ జక్కిడి నరేందర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు దాసరి నరేశ్, నాయకులు, నేచర్‌ఐకాన్ యూత్ సభ్యులు, కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### తల్లిదండ్రులు లేని పిల్లలకు ఉచిత విద్య

**నర్సాపూర్:** తల్లిదండ్రులు లేని పిల్లలకు తమ పాఠశాలలో ఉచితంగా విద్యను అందిస్తామని పట్టణంలోని డాన్‌బాస్కో ఉన్నత పాఠశాల డైరెక్టర్ నర్సిరెడ్డి చెప్పారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. తల్లిదండ్రులు లేని పిల్లలు వారి డెత్ సర్టిఫికెట్లు అందచేసి పాఠశాలలో చేరవచ్చని చెప్పారు. అలాంటి పిల్లలకు ఆదో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉచితంగా విద్య అందిస్తామన్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అలాంటి పిల్లలు ఉంటే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

**రామాయంపేట(మెదక్):** అక్రమంగా తరలిస్తున్న కలప ట్రాక్టర్‌ను పట్టుకున్న అటవీశాఖ అధికారులు జరిమానా విధించారు. రామాయంపేటలోని వ్యవసాయ కార్యాలయం ఎదుట ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద చెట్టును నేలకూల్చి కలపను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా వారు పట్టుకొని జరిమానా విధించినట్లు డిప్యూటీ రేంజ్ అధికారి ఖుద్బొద్దీన్ తెలిపారు.

### గోవులను సంరక్షించాలి


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ప్రతినిధులు

**రామాయంపేట(మెదక్):** గోహత్య నిషేద చట్టాన్ని పకడ్బందీగా అమలు పర్చాలని వీహెచ్‌పీ విభాగ్ సంఘటనా కార్యదర్శి పుట్టి మల్లేశం డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం బజరంగ్‌దళ్ ప్రతినిధులతో కలిసి గోవుల రక్షణకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయాలకు స్వస్తిపలికి గోవులను సంరక్షించాలని డిమాండ్ చేశారు. గోహత్య నిషేద చట్టాలను కఠినంగా అమలు పర్చాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సంయోజక్ మాణిక్, ప్రఖండ గోరక్ష ప్రముఖ్ సురేశ్, ఇతర ప్రతినిధులు రోహిత్, భాను, శ్యాం, నరేశ్, జితేందర్, వెంకట్ పాల్గొన్నారు.

### బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా నర్సింలు

**మెదక్ మున్సిపాలిటీ:** బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా నర్సింలు ఎన్నికయ్యారు. గురువారం పట్టణంలోని టీఎన్జీఓ భవన్‌లో బహుజన సమాజ్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకైన నర్సింలును సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ నేత మానయ్య, జిల్లా మహిళా ఇన్‌చార్జ్ లక్ష్మి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అల్లిపూర్ రమేశ్, మెదక్ జిల్లా సీనియర్ నాయకులు రామస్వామి, సిద్దిరాములు, కృష్ణ, రవిగౌడ్, భాస్కర్ బాబు, సీనియర్ నాయకులు స్వామి, దాసులు పాల్గొన్నారు.

### సన్మానం

**మెదక్ మున్సిపాలిటీ:** ఇటీవల వెలువడిన ఆల్ ఇండియా నీట్‌లో మెదక్ పట్టణంలోని 9వ వార్డుకు చెందిన విద్యార్థిని రాచపల్లి భార్గవి 557 మార్కులతో ఫ్రీ సీటు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని రాచపల్లి భార్గవిని 9వ వార్డు కౌన్సిలర్ కల్యాణి, మధుసూదన్‌లు గురువారం రాత్రి సన్మానించారు.

### విరాళం

**శివ్వంపేట(నర్సాపూర్):** మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠం అమ్మవారి ఆలయం వద్ద యాగశాల మండపం నిర్మించేందుకు భగవతి కన్స్‌స్ట్రక్షన్ అధినేత శ్రీగోపికృష్ణ గురువారం ముందుకు వచ్చారని ఆలయ వేదపండితుడు, బగలాముఖీ ఉపాసకుడు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ తెలిపారు.

# ఘనంగా పల్లె ప్రగతి ఉత్సవాలు

జిల్లా వ్యాప్తంగా గురువారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పల్లె ప్రగతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయాలను అలంకరించి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం పంచాయతీ కార్మికులను సన్మానించారు. కార్య క్రమంలో ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


చిలప్‌చెడ్ (నర్సాపూర్): ఫైజాబాద్‌లో పంచాయతీ కార్మికులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు


రామాయంపేట(మెదక్): శేరిపల్లిలో..


కొల్చారం(నర్సాపూర్): రంగంపేటలో ..


పెద్దశంకరంపేట(మెదక్): సిబ్బందిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు


నిజాంపేటలో ..


శివ్వంపేటలో..


అల్లాదుర్గం(మెదక్): చిల్వెరలో..


టేక్మాల్(మెదక్): బొడ్మట్‌పల్లిలో..


కౌడిపల్లి(నర్సాపూర్): రాయిలాపూర్‌లో..

## రోడ్డు పనులను వేగంగా పూర్తి చేయాలి


రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

ఎమ్మెల్యే రఘునందన్‌రావు

**చేగుంట(తూప్రాన్):** రెండు జిల్లాలను కలిపే రోడ్డు పనులను వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మండలంలోని కర్నాల్‌పల్లి నుంచి సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ వరకు సెంట్రల్ డెవలప్ మెంట్ ఫండ్‌తో నిర్మిస్తున్న రోడ్డు విస్తరణ పనులను గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ పరిశీలనలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు భూపాల్, బీజేపీ సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, మాజీ సర్పంచ్ రఘువీర్, హరీశంకర్, గణేశ్‌రవికుమార్, నర్సింలు, సంతోశ్‌రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు.

## పల్లె ప్రగతికి బయల్దేరిన అధికారులు


బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

**మెదక్ కలెక్టరేట్:** దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న పల్లె ప్రగతి దినోత్సవానికి కలెక్టరేట్ నుంచి బస్సులో పలువురు అధికారులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఈ బస్సును జిల్లా కలెక్టర్ రాజర్షిషా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అవార్డు గ్రహీతలైన జిల్లాలో ఎంపికైన 27 ఉత్తమ గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, ఇద్దరు ఉత్తమ మల్టీపర్పస్ వర్కర్‌లతో పాటు జిల్లా పరిషత్ సీఈఓ వెంకట శైలేశ్, డీఆర్ డీఓ శ్రీనివాస్, డీపీఓ సాయిబాబా అవార్డులు అందుకొనేందుకు వెళ్తున్నట్లు తెలిపారు.

### సర్వర్ పని చేయక ఇబ్బందులు

**నర్సాపూర్:** ప్రభుత్వ సర్వర్ పనిచేయక దరఖాస్తుదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలు, కాలేజీల్లో చేరే సమయం కావడంతో విద్యార్థులు కుల, ఆదాయ, స్థానిక ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు చేస్తున్నారు. ప్రభుత్వం పలు కుల వృత్తుల వారికి ఆర్థికసాయం అందజేస్తామని ప్రకటించడంతో ఆయా కుల వృత్తుల వారు సైతం ఆదాయం, కుల, స్థానిక ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు చేస్తున్నారు. ఒకే సీజన్‌లో విద్యార్థులు, కుల వృత్తుల వారు ఆయా పత్రాల కోసం దరఖాస్తులు చేయడంతో అందుకు సంబంధించిన ప్రభుత్వ సర్వర్ నిర్ణీత రీతిలో పని చేయడం లేదు. దీంతో దరఖాస్తుదారులు మీ సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వర్ సరిగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు జిల్లా యంత్రాంగాన్ని కోరుతున్నారు.

**అల్లాదుర్గం(మెదక్):** సర్వర్ డౌన్‌తో సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరుగుతుందని తహసీల్దార్ తులసిరాం గురువారం విలేకర్లతో చెప్పారు. మండలంలో కుల, నివాస, ఆదాయ సర్టిఫికెట్ల కోసం వందల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయని తెలిపారు. సర్వర్ డౌన్‌తో రోజుకు 20 సర్టిఫికెట్లు జారీ చేయలేని పరిస్థితి ఉందన్నారు.

## పాఠశాలలకు చేరిన పుస్తకాలు

**అల్లాదుర్గం(మెదక్):** ప్రభుత్వం పాఠశాలలకు పుస్తకాలు సరఫరా చేసినా విద్యార్థులకు మాత్రం అందలేదు. ఈ నెల 3న నుంచి ప్రభుత్వం బడిబాట కార్యక్రమం ప్రారంభించింది. 12 నుంచి పాఠశాలలు ప్రారంభమయ్యాయి. పాఠశాలలకు విద్యార్థులు వెళ్తున్న పుస్తకాలు ఇవ్వక పోవడంతో ఉట్టి చేతులతోనే వస్తున్నారు. పుస్తకాలు లేకుండా పాఠశాలకు ఎలా వెళ్లాలని చాలా మంది విద్యార్థులు వెళ్లడం లేదు. పాఠశాలకు ఉపాధ్యాయులు వస్తూ వెళ్తున్నారు. మరీ ఈ పాఠశాలల్లో విద్యబోధన ఎప్పుడు ప్రారంభిస్తారో ఎదురు చూడాల్సిందే.


అల్లాదుర్గం పాఠశాలలకు ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాలు

## ఘనంగా పెద్దమ్మ ఉత్సవాలు

**చిన్నశంకరంపేట(మెదక్):** మండలంలోని సంగాయిపల్లి గ్రామంలో పెద్దమ్మతల్లి ఉత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు. పెద్దమ్మతల్లి ఉత్సవాలకు పీసీసీ సభ్యులు చౌదరి సుప్రభాతరావు, మ్యాడం బాలకృష్ణ హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సత్యనారాయణ గౌడ్, ఎంపీటీసీలు శివకుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హఫీజ్, రమేశ్‌రెడ్డి, నాయకులు మోహన్‌నాయక్, మల్లేశం, శ్రీకాంత్‌రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.


ఉత్సవాలకు హాజరైన నేతలు

## సంక్షిప్త వార్తలు

### ◆ 'డబుల్‌బెడ్రూంలకు డబ్బులు అడుగుతున్నారు'


ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న బాచారం గ్రామస్తులు

**మెదక్‌జోన్:** డబుల్‌బెడ్రూంలు కావాలంటే డబ్బులు అడుగుతున్నారని పాపన్నపేట మండలం బాచారం గ్రామానికి చెందిన ప్రజలు గురువారం ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేదలమైన తాము డబుల్‌బెడ్రూంల కోసం దరఖాస్తు చేసుకున్నామని, ఈ విషయంలో సర్పంచ్, తహసీల్దార్ కుమ్మక్కై డబ్బులు అడుగుతున్నారని ఆరోపించారు. ఈ విషయంలో విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన రాములు, శివరాజు, జోగమ్మ, లక్ష్మయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ◆ నేడు మెదక్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్యటన

**మెదక్ మున్సిపాలిటీ:** నేడు ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి నియోజవర్గంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు.

### ◆ పాఠశాల తనిఖీ

**కొల్చారం(నర్సాపూర్):** మండలంలోని పోతంశెట్టిపల్లి ఉన్నత పాఠశాలను గురువారం మండల విద్యాధికారి నీలకంఠం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి పాఠశాల ఉపాధ్యాయులతో బడిబాట కార్యక్రమంపై సమావేశమయ్యారు. బడిబాటలో భాగంగా బడిడు పిల్లను పాఠశాలలో చేర్పించేలా చూడడంతో పాటు మానేసిన విద్యను అందించాలని సూచనలు చేశారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**టేక్మాల్(మెదక్):** మండల కేంద్రమైన టేక్మాల్‌కు చెందిన మెరాజ్‌బేగం ఇటీవల అనారోగ్యానికి గురైంది. జాగృతి మెదక్ జిల్లా అధ్యక్షురాలు పట్లోళ్ల మల్లిక అశోక్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ గురువారం ఆమె కుమారుడు ఇమ్రాన్‌కు రూ.3 లక్షల చెక్కును అందించారు. తమకు అండగా నిలిచిన ఎంపీ బీబీ పాటిల్‌కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### ఆర్థిక సాయం

**చిన్నశంకరంపేట(మెదక్):** మండలంలోని చందంపేట గ్రామానికి చెందిన గంట శేఖర్ రైలు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో స్పందించిన సర్పంచ్ శ్రీలత గురువారం మండలంలోని చందంపేట గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులకు రూ. 5 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సత్యనారాయణగౌడ్, ఉన్నారు.

### ◆ ముగ్గుల పోటీలు

**నర్సాపూర్:** దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యాలయ సిబ్బంది, మెప్మా సిబ్బందితో పాటుపట్టణంలోని పలువురు మహిళలు పోటీల్లో పాల్గొని ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకట్‌గోపాల్ మాట్లాడుతూ.. ఈనెల 16న చేపట్టే పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## సీఎం కేసీఆర్ కృషితో ప్రగతిపథంలో గ్రామాలు


గౌతోజీగూడెంలో పంచాయతీ సిబ్బందిని సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత

**మనోహరాబాద్(తూప్రాన్):** సీఎం కేసీఆర్ కృషితో ప్రతీ గ్రామం ప్రగతి పథంలోకి వెళ్లాయని, దేశంలోనే ఉత్తమ గ్రామాలుగా తెలంగాణ నుంచి ఎన్నికైయాయని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత అన్నారు. గురువారం పల్లె ప్రగతి పథంలో భాగంగా మండలంలోని గౌతోజీగూడెం గ్రామంలో జెడ్పీ చైర్‌పర్సన్ జెండావిష్కరణ చేశారు. అనంతరం పంచాయతీ సిబ్బందికి యూనిఫాంలను అందజేసి, వారిని సన్మానించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కృష్ణమూర్తి, ఎంపీడీఓ యాదిగిరిరెడ్డి, ఎంపీఓ లక్ష్మీనర్సయ్య, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం


జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

**అల్లాదుర్గం(మెదక్):** మండల కేంద్రం అల్లాదుర్గం పట్టణంలో గురువారం అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, రైతు సంఘం నేతలు రమేశ్, బేతయ్య, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

### కార్యక్రమానికి నేతలు దూరం

అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ కార్యాక్రమానికి నేతలు పాల్గొనలేదు. అల్లాదుర్గంలోనే ఎమ్మెల్యే జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తే పక్క మండాలాలకు చెందిన నేతలు పాల్గొన్న స్థానిక నేతలు దూరమయ్యారు.

## అర్హులందరికి సంక్షేమ పథకాలు

**శివ్వంపేట(నర్సాపూర్):** అర్హులందరికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతాయని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. గురువారం ఆమె స్వగ్రామమైన గోమారంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి పలు అంశాల గురించి చర్చించారు. అన్ని వర్గాల కోసం ప్రవేశపెట్టిన పథకాలు లబ్ధిపొందాల్సిన అవసరం ఉందన్నారు. సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మించుకునేందుకు అవసరమైన నిధులు త్వరలోనే మంజూరు అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు హన్మంత్‌రెడ్డి, లాయక్, వీరేష్, లక్ష్మణ్, భిక్షపతిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, ఆంజనేయులు, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.


మహిళ సమస్య వింటున్న సునీతారెడ్డి

## విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన

**కౌడిపల్లి(నర్సాపూర్):** మండల కేంద్రం కౌడిపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు అగస్త్య ఫౌండేషన్ ప్రతినిధులు సైన్స్‌పై అవగాహన కల్పించారు. గురువారం ఫౌండేసన్ ప్రతినిధులు శ్రీకాంత్, దిగంబర్, అనూష పాఠశాలను సందర్శించి విద్యార్థులను జంతుశాస్త్రం, జీవశాస్త్రం, భౌతిక, రసాయణ శాస్త్రలకు సంబంధించి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం స్వరూపరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అగస్త్య ఫౌండేషన్ ప్రతినిధులు

## శిథిలావస్థలో వాటర్‌ట్యాంకు

- 30 ఏళ్ల క్రితం నిర్మాణం
- ఎప్పుడు కూలుతుందో తెలియదు
- పట్టించుకోని అధికారులు

**శివ్వంపేట(నర్సాపూర్):** శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకు ఎప్పుడు కూలుతుందో... ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుంటుందో తెలియదు. మండల పరిధిలోని బిక్యా పంచాయతీ సిత్యా తండాలో ఉన్న 40 వేల లీటర్ల రక్షితవాటర్ ట్యాంకుకు ఇనుప చువ్వలు తేలి శిథిలావస్థకు చేరింది. 30 సంవత్సరాల క్రితం పూర్వ శివ్వంపేట పంచాయతీ పరిధిలోని బిక్యా, నాను, సిత్యా తండాలకు తాగునీటి అవసరాల కోసం సిత్యా తండాలో ట్యాంకును నిర్మించారు. ప్రస్తుతం ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో పాటు పైపులు తుప్పు పట్టడం, ట్యాంకు పైకి ఎక్కే మెట్లు ప్రమాదంగా ఉన్నాయి. శిథిలావస్థకు చేరిన ట్యాంకుతో నీటి సరఫరా సక్రమంగా జరగక తండా వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, సంబంధిత జిల్లా ఉన్నతధికారులు స్పందించి, నూతన ట్యాంకు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


సిత్యా తండాలో శిథిలావస్థకు చేరిన ట్యాంకు

**తాగునీటి ఇబ్బందులు**

బిక్యా పంచాయతీ పరిధిలో 5 తండాలు ఉన్నాయని సిత్యా తండాలో ఉన్న పురాతన ట్యాంకు కూలిపోయే దశకు చేరుకుంది. ఇతర తండాల్లో నీటి ట్యాంకుల నిర్మాణం చేపట్టాం. సిత్యా తండాలో కొత్త ట్యాంకు నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని అధికారులను కోరాం.

– సుమలతరాజ్‌కుమార్, సర్పంచ్

## జీపు జాతాను జయప్రదం చేయండి

**మెదక్‌జోన్:** ఈనెల 20న జీపుజాత మెదక్ జిల్లాకు చేరుకుంటుందని, దీనిని జయప్రదం చేయాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లేశం, యూనియన్ జిల్లా కార్యదర్శి నర్సమ్మ పిలుపునిచ్చారు. గురువారం మెదక్ కేవల్ కిషన్ భవనంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ అధ్యక్షతన అంగన్‌వాడీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్ విడుదల చేసి వారు మాట్లాడుతూ... ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని, అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, గ్రాడ్యువిటీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈనెల 16న అదిలాబాద్ జిల్లా జీపు జాతా ప్రారంభమై కామారెడ్డి, సిద్దిపేట జిల్లాల మీదుగా ఈనెల 20న మెదక్ జిల్లాకు చేరుకుంటుందన్నారు. జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల అంగన్‌వాడీ ఉద్యోగులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బసవరాజు, అంగన్‌వాడీ ఉద్యోగుల జిల్లా ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం